క్లుప్తంగా

కడపలో ప్రజాదర్బార్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. శనివారం రవీంద్రనగర్‌లోని యూఎస్ ఫంక్షన్ హాలులో వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, 'స్పందన', 'గడప గడపకు మన ప్రభుత్వం', జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలన్నీ ప్రజా సమస్యలు తీర్చేందుకేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

రక్తదానం

కడప కల్చరల్ : ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా శనివారం కడప నగర పరిధిలోని ముక్తియార్ గ్రూప్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలతోపాటు ఖూన్ కా రిస్తా సంస్థ చైర్మన్ తారీఖ్ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరం ఏర్పాటుకు కృషి చేసిన తారిఖ్, సహకరించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో 32 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల అధినేత అలీ అక్బర్, ప్రిన్సిపాల్ నాగూరు బాబు, రిమ్స్ బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాఘవేంద్ర, అధ్యాపకులు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బార్మీ అన్నదానం


ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు


కడప కార్పొరేషన్ : కడప నగరం సాయిబాబా థియేటర్ దగ్గర మయూర హోటల్ ఎదురుగా ఎస్ఆర్ఐ గ్రూప్స్ ఆధ్వర్యంలో శనివారం బార్మీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాష, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు హాజరై ప్రార్థనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మిలాదున్ నబీ సందర్భంగా బార్మీ అన్నదానం చేయడం మహా పుణ్యకార్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కన్వీనర్ బిహెచ్ ఇలియాస్, షేక్ అన్సర్, గయాస్, ఉస్మాన్ బాష, అల్లా బకాష్, అబుతురాబ్, సలీం, లతీఫ్, కార్పొరేటర్లు షఫీ, జిలాన్, ఎన్నారై గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

'దండమూడి'కి ఘన నివాళి


దండమూడి ఫ్లెక్సీ ఆవిష్కరించి నివాళి అర్పిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప, క్రీడాకారులు

కడప అగ్రికల్చర్ : దండమూడి రాజగోపాల్ రావు క్రీడా స్ఫూర్తి, దాతృత్వం భావితరాలకు ఆదర్శం అని సీనియర్ షటిల్ క్రీడాకారుడు, కడప డీసీసీ బ్యాంకు ఓఎస్‌డి, డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప అన్నారు. మిస్టర్ ఆసియా బిరుదు పొందిన తొలి భారతీయుడు, ఇండియన్ టార్జన్, ఒలంపిక్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో 3 సార్లు భారత దేశానికి ప్రాతినిధ్యం వహించిన వెయిట్ లిఫ్టర్ దండమూడి రాజగోపాల్‌రావు జయంతిని శనివారం కడప ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి దండమూడి ఫ్లెక్సీని ఆవిష్కరించి ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండమూడి రాజగోపాల్ రావు సాధించిన విజయాలు వివరించారు.

ప్రమాదవశాత్తు మృతి


చంద్రకిషోర్ (ఫైల్)

కడప వైవీయూ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయకుడు పసుపులేటి చంద్రకిషోర్(50) శనివారం తన ఇంట్లో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. అదే సమయంలో గుండెపోటు రావడంతో మరణించాడు. ఆయన ఆకస్మిక మృతి పట్ల వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వెంకటసుబ్బయ్య, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి, గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్, వైవీయూ పాలక మండలి సభ్యుడు మూల మల్లికార్జునరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

నేటి నుంచి దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు


నగరంలోని అమ్మవారిశాలలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన సెట్టింగ్

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిరోజు రాత్రి 7.00 గంటల నుంచి విశేష అలంకారం, ఊరేగింపు ఉంటాయన్నారు. 15న తిరుచ్చి ఉత్సవం, 16న శేష వాహనం, 17న చంద్రప్రభ వాహనం, 18న హనుమంతవాహనం, 19న సాయంత్రం 5.00 గంటలకు గరుడవాహనం, 20న కల్పవృక్ష వాహనం, 21 సాయంత్రం 5.00 గంటలకు గరుడ వాహనం, 22న చిన్నశేష వాహనం, 23న అశ్వవాహనం నిర్వహిస్తామన్నారు.

శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో..

కడప నగరం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు కల్యాసుధాకర్ తెలిపారు. ఇందులో భాగంగా 15న శ్రీ చౌడేశ్వరి అలంకారం, 16న శ్రీ రాజేశ్వరి, 17న శ్రీ లలితాదేవి, 18న శ్రీ అన్నపూర్ణాదేవి, 19న శ్రీ మోహిని, 20న శ్రీసరస్వతిదేవి, 21న శ్రీ గజలక్ష్మిదేవి, 22న శ్రీ మహిషాసుర మర్దినిదేవి, 23న శ్రీ విజయలక్ష్మిదేవి అలంకారాలు నిర్వహిస్తామని వివరించారు.

– కడప నగరంలోని అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ధ్యాన దసరా ఉత్సవాలు

కడప రూరల్ : ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ధ్యాన దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు పిరమిడ్ స్పిరుచువల్ ట్రస్ట్ ధ్యాన దసరా ఉత్సవ కమిటీ సభ్యులు డీ సతీష్ కుమార్, సీ ఓబయ్య, రెడ్డి వెంకటసుబ్బయ్య సుదీప్తి తెలిపారు. శనివారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి పిరమిడ్ ధ్యాన మహా క్షేత్రంలో మూడు రోజులు కుల మతాలకు అతీతంగా ధ్యాన దసరా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలు పోట్లదుర్తి గ్రామం బిస్మిల్లాబాద్‌లో జరుగుతాయన్నారు. ఉదయం 6 నుంచి సామూహిక సంగీత ధ్యానం, స్వర్ణమాల పత్రీజీ సందేశం, విశిష్ట అతిథులు పరిచయం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ధ్యాన దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం సత్యనారాయణ, ఆర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదు


ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో మేనేజర్ ఆర్టీసీ ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదని ఎన్ఎంయూఏ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, రీజినల్ సంయుక్త కార్యదర్శి దాస్‌లు తెలిపారు. శనివారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిని కలిసి డిపో మేనేజర్ తీరుపై వారు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి సాహసోపేత నిర్ణయం తీసుకుంటే అధికారులు ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తమ యూనియన్ 23 వేలమంది ఉద్యోగుల సభ్యత్వమున్న అసోసియేషన్ అన్నారు. కడప డిపోలో ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచాల్సిపోయి లేనిపోని కారణాలతో సాకుగా చూపి సర్వీసులను రద్దు చేస్తూ కండక్టర్లు, డ్రైవర్లను అన్ని విధాల ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఈ విషయంగా చైర్మన్ ఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడి రద్దు చేసిన సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు.

16న కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 16న జగనన్న క్లాప్ మిత్రల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్నట్లు స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కే.సి.బాదుల్లా పేర్కొన్నారు. శనివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీలలో కార్మికులు పనులు నిలుపుదలచేసి రిక్షాలు, ఆటోలను పక్కన పెట్టి వేరే పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

18న రాష్ట్ర సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 18న కృష్ణా జలాల అంశంపై నిర్వహించే రాష్ట్ర ప్రాజెక్టుల సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఈ మేరకు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, టీడీపీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎంఏ గఫూర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, సాగునీటి పారుదల రంగ నిపుణులు బొజ్జ దశరథ రామిరెడ్డి తదితర నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాశాఖ రిసోర్స్ పర్సన్‌కు ప్రధాని ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రంతో డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులుకు భారత ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసలు లభించాయి. విద్యార్థులకు పరీక్షలపై అవగాహన, భయం లేకుండా రాయడం లాంటి విషయాలపై పరీక్షా పే చర్చా–2023 కార్యక్రమంలో ప్రధానమంత్రి విద్యార్థులతో ముఖాముఖి చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అనుభవజ్ఞులు, నిపుణులు అయిన ఉపాధ్యాయుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ మేరకు గునిశెట్టి శ్రీనివాసులు ప్రధాని కార్యాలయం నుంచి వ్యక్తిగతంగా రిజిస్టర్ పోస్టు ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈయన పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గతంలో ఈయన 2021–22 బడ్జెట్‌పై సూచనలు ఇచ్చినందుకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. ఆయనను ఉపాధ్యాయులతోపాటు విద్యా శాఖ అధికారులు అభినందించారు. ప్రధానమంత్రి నుంచి లభించిన ప్రశంసాపత్రం తనకు అత్యంత విలువైనదని గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ కోరారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల తుంగభద్ర కు భవిష్యత్తులో నీళ్లు వచ్చే అవకాశం లేదన్నారు. తద్వారా కేసీ కెనాల్ ఆయకట్టు రైతాంగం ఇబ్బందులకు గురవుతారన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్ మనోహర్ శివకుమార్, ఐఎన్ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులను కాలరాయడం తగదు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వకుండా జిల్లాలో ఉన్న కొన్ని కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల స్వేచ్ఛను హరింప చేస్తున్నారని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు గణేష్ అన్నారు. శనివారం కడప ప్రగతి నర్సింగ్ హోంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ నిబంధనల ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులు ఇచ్చారన్నారు. కానీ కడప నగరంలోపాటు బద్వేల్, పులివెందుల ప్రాంతాల్లో కొన్ని కార్పొరేట్, ప్రవేటు యాజమాన్యాలు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

స్కూటర్లు ఢీ ; ఒకరు మృతి


ప్రమాదంలో మృతి చెందిన పి. నాగేంద్ర

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలో శనివారం రాత్రి రెండు స్కూటర్లు ఢీ కొని పి.నాగేంద్ర (28) మృతి చెందగా అశోక్, భార్య అంజలిలు గాయపడ్డారు. పోలీసుల వివరాలు మేరకు మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లి పంచాయతీ ముదినేని వడ్డిపల్లికి చెందిన పి.నాగేంద్ర రాయచోటి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మోటకట్ల పంచాయతీ చెరువు ముందరపల్లికి చెందిన అశోక్ (40), ఆయన భార్య అంజలి ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళ్తుండగా మార్గమధ్యంలోని ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ అశోక్, అంజలిలను 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగేంద్రకు భార్య, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ తులసీరామ్, ఎస్ఐ షరీఫ్‌లు పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ రాక

కమలాపురం : పట్టణంలో ఆదివారం జరిగే పార్టీలో చేరిక కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువనేత ఇస్మాయిల్ ఆధ్వర్యంలో 16వ మున్సిపల్ వార్డులో అత్యధికంగా, అలాగే 15, 17, 19, 2వ వార్డు నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయ వంతం చేయాలని ఆయన తెలిపారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెలగ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లీనిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

యువతి అదృశ్యం

నందలూరు (రాజంపేట) : పొత్తపి గ్రామానికి చెందిన సాయి తేజ అనే యువతి ఈనెల 13వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఫిర్యాదు అందుకున్న పోలీసులు యువతి ఆచూకీ మూడు గంటల్లో ఛేదించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం నందలూరు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. యువతి తండ్రి నరసింహులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి కేసు నమోదు చేసి మూడు గంటల వ్యవధిలో నెల్లూరులో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి యువతిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొని వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొనడంతో యర్రబోగుల సుబ్రమణ్యం అలియాస్ సురేష్(37) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రైల్వేకోడూరు వీపీఆర్ కండ్రిక జె. శెట్టి పల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఏపీఎండీసీ నర్సరీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై రైల్వేకోడూరుకు బయలుదేరాడు. మంగంపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీ కనిపించకపోవడంతో వేగంగా ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా గౌస్‌పీరా

వేముల : వేములకు చెందిన కె.గౌస్‌పీరా జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కడపలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా ప్రమాణం చేశారు. ఈ పదవి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటిమిట్ట చెరువుకి సోమశిల బ్యాక్ వాటర్

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో 2023 – 24 సంవత్సరానికి గాను వర్షపాతం తక్కువగా నమోదైంది. దీంతో ఒంటిమిట్ట చెరువులో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయాయి. సంబంధిత ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం కుడమలూరు సోమశిల వెనుక జలాల పంప్ హౌస్ నుంచి ఒంటిమిట్ట చెరువుకు సోమశిల జలాలను ట్రైల్ రన్ చేశారు. ఈ ట్రైల్ రన్ విజయవంతం కావడంతో నేడు(ఆదివారం) రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మండలంలోని కుడమలూరులో ఉన్న సోమశిల వెనుక జలాల నుంచి ఒంటిమిట్ట చెరువుకు నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు.

మొండి వైఖరి వీడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్య, ఉపాధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వీడాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా యువకులు ఉన్న దేశంగా భారతదేశం ఉంది. కానీ నేటి యువతరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చదువుకు తగ్గ ఉద్యోగాలు ఇవ్వక, పరిశ్రమలను ఏర్పాటు చేయక, యువత నిరుద్యోగులగానే ఉండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు


'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమం కోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 29వ డివిజన్‌లోని రహమతుల్లా స్ట్రీట్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా షేక్ రుక్సానా అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న ప్రభుత్వంలో రూ.9.27లక్షలు లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. పర్వీన్ బేగం అనే మహిళ మాట్లాడుతూ గతంలో వృద్ధాప్య పింఛన్ కోసం దూరా బారం వెళ్లే వారమని ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారని హర్షం వ్యక్తం చేసింది. అప్సర్ అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి, ఇంటి స్థలం పథకాల ద్వారా తమకు రూ.8.50లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 29వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ రిజ్వాన్, ఇన్‌చార్జి డిష్ జిలాన్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, రామమోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, బంగారు నాగయ్య, ఇలియాస్, సుబ్బారెడ్డి, అక్రమ్, గయాజ్, పత్తిరాజేశ్వరి, మూలే సరస్వతి, వెంకట సుబ్బమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

మండెం లక్ష్మీనారసింహుడి ఆలయానికి మహర్దశ

చిన్నమండెం : మండలంలోని మాండవ్యా నది తీరాన వెలసిన మండెం రాయుడిగా ప్రసిద్ధికెక్కి తాళ్లపాక అన్నమాచార్యులుచే ఆరాధించబడిన శ్రీమండెం లక్ష్మీ నరసింహస్వామికి ఎనిమిదో శతాబ్దంలో చోళులు ఆలయ నిర్మాణం చేపట్టారు. తర్వాత శ్రీ కృష్ణదేవ రాయ పాలనలో ఆలయం చుట్టూ ప్రాంగణాన్ని గోపురాలు రూపుదిద్దుకొని ఈ ప్రాంత భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. తదనంతర కాలంలో ఆలయ ప్రాశస్తి దెబ్బతింటూ వచ్చింది. పాడుబడిపోతున్న ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణతో ఆలయ రూపురేఖలను మార్చాలని స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, స్థానిక ప్రజల విన్నపం మేరకు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రూ. 1.50 కోట్లను మొదటి విడతగా మంజూరు చేయించి ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఆలయం పూర్వ వైభవం పొందుతుండటంతో ఎమ్మెల్యే చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

16న పనుల ప్రారంభం

కొన్ని దశాబ్దాలుగా పాడుబడి కనిపిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిల చేతులమీదుగా భూమిపూజ చేపట్టనున్నారు. ఇప్పటికే పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. పనుల ప్రారంభం నుంచి నిర్ణీత కాలంలో ఆలయం పనులను పూర్తి చేసేలా తగిన ప్రణాళికను సిద్ధం చేశారు. భూమిపూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పోరాటం

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పోరాటం చేయనున్నట్లు ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీనివాస ఐటీఐలో ఆర్ఎస్‌యూ జిల్లా రెండవ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చదువుకున్న విద్యార్థులు, యువతకు సరైన ఉపాధి లేక గల్ఫ్ దేశాలకు వలసలు వెళుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తగ్గించాలన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలో నూతన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్షపార్టీల నేతల వ్యక్తిగత స్వార్థం వలన రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు. విభజన హామీల అమలుకు త్వరలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కారం కోసం నవంబరు 5 నుంచి జీపు జాతను చేపట్టనున్నట్లు తెలిపారు. హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి వారి సమస్యలను పరిష్కరించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా నేతలు వీరాంజనేయులు, వంశీ, కిరణ్, మల్లేష్, సుకుమార్, సరేంద్రతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.